# నవజాత శిశువులకు శ్రీరామరక్ష

**అపరసంజీవనిలా ఎస్ఎన్‌సీయూ**

- కార్పొరేట్‌కు దీటుగా చిన్నారులకు ఉచిత వైద్యం
- ఏరియా ఆస్పత్రిలో 42 పడకలతో నూతన వార్డు
- 24 గంటల వైద్య సదుపాయం


పీడియాట్రిక్ వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులు




పౌష్టికాహారంపై అవగాహన చిత్రాలు

**భద్రాచలంఅర్బన్:** ఆధునిక వైద్యపరికరాలు.. 24 గంటల పాటు అందుబాటులో వైద్యులు అత్యాధునిక సేవలతో భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో గల సిక్ న్యూబార్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్ సీయూ), తో పాటు ఉన్న మరో రెండు వార్డులు చిన్నారులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఈ వార్డులు శిశువులకు అపరసంజీవనిలా మారింది. ఏరియా ఆస్పత్రిలో ఇప్పటికే చిన్నారుల వైద్యం నిమిత్తం మూడు వార్డులున్నాయి. సుమారు రూ.22 లక్షల కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ ఏడాది జనవరిలో ఏర్పాటైన ఈ సెంటర్, చిన్నారులకు శ్రీరామరక్షగా నిలుస్తోంది. నెలలు నిండిన తరువాత చిన్నారులను ఈ వార్డులో ఉంచి వైద్య సేవలందిస్తున్నారు. అయితే ఇప్పటికే ఏరియా ఆస్పత్రిలో నెలలు నిండక ముందే పుట్టడం, అతి తక్కువ బరువు ఉండడం, ఫిట్స్ రావడం, రకరకాల ఇన్‌ఫెక్షన్లతో బాధపడడం తదితర సమస్యలన్నింటికీ రూపాయి ఖర్చు లేకుండా మెరుగైన వైద్యం అందిస్తోంది. కార్పొరేట్ హాస్పిటళ్లకు దీటుగా సేవలందుతుండడంతో పరిసర ప్రాంత ప్రజలకు భరోసా దొరుకుతోంది. గడిచిన రెండు రోజులు భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో ఎన్‌క్వాస్ బృందం (ముస్కాన్, లక్ష్యా) పర్యటించింది. అయితే ఈ పర్యటనలో వారు ఆస్పత్రిలో గల పీడీయాట్రిక్ వార్డులతో పాటు లెబర్ రూం, ఆపరేషన్ థియేటర్‌ను వారు సందర్శించారు. ఈ సందర్భంగా జనవరి నెలలో ఏరియా ఆస్పత్రిలో చిన్నారులకు మెరుగైన వైద్యం అందించే విధంగా 42 పడకలతో నూతన వార్డును ఆస్పత్రి అధికారులు ప్రారంభించారు. ముస్కాన్ బృందం వస్తున్న సందర్భంగా ఈ నూతన వార్డును అందమైన చిత్రాలతో తీర్చిదిద్దారు. అత్యాధునిక వైద్య పరికరాలు సమకూర్చారు. వీటిలో గల ఎస్ఎన్‌సీయూ వార్డులు 20 పడకలు ఏర్పాటు చేశారు.

**24 గంటల పర్యవేక్షణ...**

ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రామకృష్ణ పర్యవేక్షణలో ఐదుగురు ఎండి, పిడియాట్రిక్ వైద్యులు కైలాష్ మోహన్, విజయ్‌రావు, రాజశేఖర్ రెడ్డి, క్రాపా విజయ్, సుమన్ విధులు నిర్వహిస్తున్నారు. షిఫ్టులు వారీగా 24 గంటలు అందుబాటులో ఉండి చిన్నారులకు వైద్య సేవలు అందిస్తున్నారు. వీటితో పాటు పీడీయాట్రిక్ వార్డులో 30 పడకలు, ఎన్ఆర్సీ వార్డులో 10 పడకలు , అదే విధంగా క్యాజువాలిటీలో మరో 6 పడకలు చిన్నారుల వైద్యం అందించే విధంగా అధికారులు ఏర్పాటు చేశారు.

**ఒక్కొక్కటిగా సకల వసతులు..**

ఏజెన్సీ ప్రాంతం అయిన భద్రాచలంలో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తెలంగాణ రాష్ట్రంతో పాటు మరో మూడు రాష్ట్రాల నుంచి ప్రజలు నిత్యం వైద్యం కోసం వస్తుంటారు. వీటిలో దృష్టిలో పెట్టుకుని ఇటు ఆస్పత్రి అధికారులు, అటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆసుపత్రిలో ప్రజల అవసరాల నిమిత్తం ఒక్కొక్కటిగా సకల వసతులు కల్పించే విధంగా కృషి చేస్తున్నారు.

**చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు**



ఏరియా ఆస్పత్రిలో చిన్నారులకు మెరుగైన వైద్యం అందించే విధంగా 42 పడకలతో పీడియాట్రిక్ వార్డును ఈ ఏడాది జనవరిలో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రైవేట్‌కు వెళ్లలేక తల్లిదండ్రులు అవస్థలు పడేవారు. ఇప్పుడు ఇక్కడే అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నాం. కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా ఇప్పుడు ఏరియా ఆస్పత్రిలోనే అన్ని వసతులను కల్పిస్తున్నాం.

– డా.రామకృష్ణ, ఏరియా ఆస్పత్రి, సూపరింటెండెంట్, భద్రాచలం

**24 గంటలు వైద్యం అందిస్తున్నాం**



చిన్నారులకు ఏర్పాటు చేసిన నాలుగు వార్డుల్లో చిన్నారులకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నాం. అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి ఏడాది వరకు ఎదురయ్యే అన్ని రకాల సమస్యలకు వైద్యం అందుబాటులో ఉంటుంది. చిన్నారుల్లో రకరకాల సమస్యలు ఉంటాయి. చిన్నారుల్లో వచ్చే ప్రధాన సమస్యలకు ఇక్కడే వైద్యం అందిస్తున్నాం. 24గంటల పాటు వైద్యులం అందుబాటులో ఉంటున్నాం.

– డా.రాజశేఖర్ రెడ్డి, పీడియాట్రిక్ వైద్యులు, ఏరియా ఆస్పత్రి

## క్లుప్తంగా

### ముగిసిన పెద్దమ్మతల్లి జాతర


పెద్దమ్మతల్లి విగ్రహంతో ఊరేగింపు

**చండ్రుగొండ :** మండలంలోని మద్దుకూరు గ్రామంలో రెండురోజులుగా నిర్వహించిన పెద్దమ్మతల్లి జాతర ఆదివారం ముగిసింది. ఆదివాసీల ఆరాధ్యదైవం పెద్దమ్మతల్లికి ఏడాదికి ఒకసారి జాతర నిర్వహిస్తారు. చివరిరోజు పెద్దమ్మతల్లిని ఎత్తుకుని భక్తులు అగ్నిగుండం ప్రవేశం చేశారు. కోరుకున్న భక్తులకు కొంగు బంగారంగా వర్ధిల్లుతున్న ఈ దేవత సన్నిధిలో వందలాదిమంది దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

### బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలి

**అశ్వాపురం:** ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు మండల వ్యాప్తంగా వైభవంగా నిర్వహించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోడి అమరేందర్ అన్నారు. ఆదివారం అశ్వాపురంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆవిర్భావ దినోత్సవం మండలంలో పంచాయతీల్లో గ్రామ గ్రామాన గులాబీమయం చేసి పార్టీ జెండా గద్దెలకు రంగులు వేసి జెండాలు ఆవిష్కరించాలన్నారు. పార్టీ అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

### పుస్తక దినోత్సవం


కేక్‌కట్ చేస్తున్న సుధాకర్

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణంలో ప్రపంచ పుస్తక దినోత్సవ వేడుకలను సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో కేక్ కట్ చేసి పాఠకులకు స్వీట్లు పంచి పెట్టారు. పలువురు వక్తలు మాట్లాడుతూ... పుస్తకాలు చదివితేనే విజ్ఞానం సమకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిబ్రు సుధాకర్, కార్తికేయ, కోటేష్, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### అధికారులు స్పందించాలి

**మణుగూరుటౌన్:** మండలంలోని ప్రభుత్వ భూమిని ఒక గిరిజనేతరుడు 1/70యాక్టుకు విరుద్ధంగా అమ్ముకుంటున్నాడని ఎమ్మార్పీఎస్ నాయకుడు కొమ్ము హుస్సేన్ ఆరోపించారు. ఆదివారం ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మణుగూరు మున్సిపాలిటీలోని బాపనకుంట గ్రామంలోని ఒక ప్రభుత్వ భూమిలో గ్రామస్తులంతా కలిసి జగ్జీవన్‌రావు, అంబేద్కర్ల పేరుతో కమ్యూనిటీ హాల్స్ నిర్మించుకోవడానికి నిర్ణయించారన్నారు. అందుకు సంబంధించిన విషయాలను స్థానిక రెవెన్యూ అధికారులకు తెలియజేయడంతో స్థలం పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారన్నారు. ఆ ప్రభుత్వ భూమిని ఆనుకుని ఇల్లు కట్టుకున్న ఒక వ్యక్తి ప్రభుత్వ స్థలం తనదే అంటూ అమ్ముకున్నాడన్నారు. దీనిపై ప్రభుత్వ అధికారులు స్పందించాలని తెలిపారు. లేనిపక్షంలో కలెక్టర్‌కు ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు బోయిళ్ల నర్సింహారావు, ఉసికల కొండయ్య, మల్లేష్‌లు పాల్గొన్నారు.

### మరింత అప్రమత్తంగా ఉండాలి

**బూర్గంపాడు:** వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా గాలిదుమ్ములు వస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. గాలిదుమ్ములకు కరెంట్ వైర్లు తెగిపడే అవకాశాలున్నాయని, విద్యుత్ స్తంభాలు పడిపోయే ప్రమాదాలున్నాయని తెలిపారు. ప్రజలు తెగిపడిన విద్యుత్ తీగలను, విరిగిన స్తంభాలను గమనించాలని, పశువులు, జీవాలను కూడా జాగ్రత్తగా ఉంచుకోవాలని పేర్కొన్నారు.

### వృద్ధుడి మృతి

**దమ్మపేట:** మండల కేంద్రంలోని దమ్మపేట ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో వివరాలు గుర్తు తెలియని యాచక వృద్ధుడు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. దమ్మపేటలో కొద్ది రోజులుగా గుర్తు తెలియని వృద్ధుడు యాచిస్తూ, బస్‌స్టేషన్‌లో నివాసం ఉంటున్నాడు. ఆదివారం కదలకుండా ఉండిపోయిన తన్ని, స్థానికులు గమనించి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో పోలీసులకు, గ్రామ పంచాయితీ వారికి సమాచారం అందించగా అంత్యక్రియలు నిర్వహించారు.

# రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులే గెలవాలి

- డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య



నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య

**భద్రాచలం:** రానున్న ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలవాలని ఆ దిశగా కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్‌లో భాగంగా పినపాక, అశ్వారావుపేట నియోజకవర్గాలకు మోతుకూరి ధర్మారావు, ఏనుగుల అర్జున్‌రావులను కో ఆర్డినేటర్లుగా నియమించారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో వీరికి పొదెం వీరయ్య నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు నాయకులను, కార్యకర్తలను సన్నద్ధం చేయాలని సూచించారు. కాగా తమపై నమ్మకం ఉంచి బాధ్యతలను అప్పజెప్పిన నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సరెళ్ల నరేష్, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి వీరాపురం లక్ష్మణ్, గరీబ్ పేట ఎంపీటీసీ కసనబోయిన భద్రం , సరెళ్ల వెంకటేష్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చింతరేల సుధీర్, ఎడారి ప్రదీప్, కొత్తగూడెం పట్టణం సోషల్ మీడియా కో ఆర్డినేటర్ సాయి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# వీఓఏల సమస్యలు పరిష్కరించాలి


భద్రాచలంఅర్బన్: సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరయ్య

**భద్రాచలంఅర్బన్:** ఐకేపీ, వీఓఏలు చేపట్టిన సమ్మెకు ఆదివారం భద్రాచలం శాసనసభ్యులు పొదెం వీరయ్య మద్దతు తెలిపి మాట్లాడారు. వెంటనే వీఓఏల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ ప్రభుత్వం కళ్లు తెరిచి వారి న్యాయమైన డిమాండ్లు, గౌరవ వేతనంగా రూ.26 వేలు చెల్లించి, ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సరెళ్ల నరేష్, ఎల్డీఎం ఇన్‌చార్జ్‌లు మోతుకూరి ధర్మారావు, అర్జున్‌రావు, స్టేట్ సోషల్ మీడియా జనరల్ సెక్రటరీ విరపురం రామ్ లక్ష్మణ్, వెంకటేష్, యూత్ కాంగ్రెస్ డివిజన్ ప్రెసిడెంట్ చింతరేళ్ల సుధీర్, యూత్ కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యడారి ప్రదీప్, ఉబ్బ వేణు, కొత్త శ్రీను మహిళా కాంగ్రెస్ నాయకులు ఓంపోలు దేవకీ పాల్గొన్నారు

**అశ్వారావుపేటరూరల్:** ఏన్నో ఏళ్లుగా పని చేస్తున్న వీవోఏలకు ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. వీఓఏలు చేస్తున్న సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి వారికి మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు వేముల భారతి, తిరుమల, నాయకులు మొగళ్లపు చెన్నకేశవ రావు, వీవోఏల సంఘం బాధ్యులు ఎస్‌కే.షాహిన్, బేబి, భాగ్యలత, సుజాత ఉన్నారు.

**వంటవార్పును విజయవంతం చేయాలి**

**దుమ్ముగూడెం:** వీఓఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మే 3న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన వంటవార్పు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీఓఏల మండలాధ్యక్షుడు గద్దల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వీఓఏలు లత, కృష్ణవేణి, రమాదేవి,లత, రేఖ, నరేంద్ర, పద్మ, నాగరాజు, రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


అశ్వారావుపేటరూరల్: వీఓఏలకు మద్దతు తెలుపుతున్న తాటి వెంకటేశ్వర్లు


దుమ్ముగూడెం: సమ్మెలో కూర్చున్న వీఓఏలు

# ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రద్రం చేయాలి


ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా

**అశ్వారావుపేటరూరల్:** ఈ నెల 25న అశ్వారావుపేట సమీపంలోగల ఓ పామాయిల్ తోట వద్ద నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని పార్టీ మండల అధ్యక్షులు బండి పుల్లారావు కోరారు. ఈ మేరకు అశ్వారావుపేటలో నిర్వహించే ఈ సమావేశం ప్రాంగణాన్ని ఆదివారం ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పరిశీలించి, పార్టీ నాయకులకు సూచనలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ జెండా పండుగలో భాగంగా ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశామని, దీనికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ ఆకుల బాలకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, యూఎస్ ప్రకాశ్‌రావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతల ఆందోళన..

**బూర్గంపాడు/దుమ్ముగూడెం/అశ్వాపురం:** వేసవి ఎండలు మండుతూ రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న సమయంలో ఒక్కసారిగా గత రెండు రోజులుగా సాయంత్రం వాతావరణం మేఘావృతమై ఉరుములు మెరుపులు ఈదురుగాలులు, చిరుజల్లులు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురుస్తుండటంతో వరికోతలు నిలిచిపోయాయి. మిర్చి పంటను కోసి కల్లాలో ఆరబెట్టిండగా ఆకస్మాత్తుగా అర్ధరాత్రి సమయంలో ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి రైతులు పండించిన పంటను కాపాడుకునేందుకు రాత్రి వేలల్లో నరకయాతన పడ్డారు. ఆరబోసిన ధాన్యాన్ని వర్షాల నుంచి కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ధాన్యపు రాశులపై టార్పాలిన్లు, పరదాలు కప్పుకునే పనులలో రైతులు నిమగ్నమయ్యారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా వందలాది బస్తాల ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయింది. ఇలా కోతల దశలో అకాల వర్షాలు రావడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.


బూర్గంపాడు: ఆరబోసిన ధాన్యపు రాశులు


దుమ్ముగూడెం: ఆరబెట్టిన మిర్చి


అశ్వాపురం: కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న పీఏసీఎస్ చైర్మన్, రైతులు

# నరసింహుడికి వైభవంగా చందనాభిషేకం


చందనాలంకరణలో స్వామివారు

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణంలోని అహోబిలమఠంలోని నరసింహ స్వామివారిని ఆదివారం చందనంతో అలంకరించి అభిషేకం నిర్వహించారు. ప్రతీ ఏటా అక్షయ తృతీయ సందర్భంగా నరసింహ భీజాక్షరాలు సంఖ్య 32 అనే రోజు స్వామివారికి 32 కేజీల చందనంతో చందనోత్సవ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేస్తారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కృష్ణ చైతన్య స్వామి స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## అటెన్షన్ ప్లీజ్

# ప్రమాదకరంగా మలుపు



మండల పరిధిలోని నెల్లిపాక గ్రామంలో జిన్నింగ్ మిల్లు వద్ద మొండికుంట-సారపాక రహదారిపై మలుపు ప్రమాదకరంగా ఉంది. మలుపు వద్ద ఇరువైపులా ఎలాంటి హెచ్చరికబోర్డులు లేకపోవడంతో తరచూ ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీ కొని ప్రమాదాలు జరిగి ఎందరో గాయాలపాలవుతున్నారు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆర్అండ్‌బీ, పోలీస్ అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. – అశ్వాపురం

ప్రశ్నించాల్సిన అధికారి : రాంబాబు, ఆర్అండ్‌బీ ఏఈ.
సెల్ నంబర్ : 9441435367

# ఆర్అండ్‌బీ ఏఈ పోస్టు భర్తీ ఎప్పుడో?


నిరుపయోగంగా ఉన్న ఆర్అండ్‌బీ కార్యాలయం

**అశ్వాపురం:** మండలంలో రోడ్డు భవనాల శాఖ(ఆర్అండ్‌బీ) ఏఈ పోస్టు భర్తీ కావడం లేదు. మండలానికి రెగ్యులర్ ఏఈ లేకపోవడంతో ఆ శాఖలో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇల్లెందు ఏఈ రాంబాబు అశ్వాపురానికి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. పూర్తి స్థాయి ఏఈ లేక మండలంలో ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో జరుగుతున్న రహదారుల పనులు పర్యవేక్షణ అంతంతమాత్రంగా కొనసాగుతోంది. ఇల్లందు ఏఈ రాంబాబుకు అశ్వాపురం మండలం అదనంగా బాధ్యతలు ఇవ్వడంతో ఆయన రెండు చోట్ల విధులు నిర్వర్తిస్తుండటంతో పూర్తి స్థాయిలో పనులను పర్యవేక్షించడం లేదు. ఇన్‌చార్జ్ ఏఈ మండలంలో ఈఈ, డీఈలు పర్యవేక్షణ సమయంలో అప్పుడప్పుడు వస్తుండటంతో ఆర్అండ్‌బీ రహదారుల నిర్మాణాలపై పర్యవేక్షణ కొరవడింది. మండలంలో మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారి గుంతలమయమై అధ్వానంగా ఉండి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కల్వర్టులు, మూలమలుపులు ప్రమాదకరంగా ఉండి రోడ్డు కనీసం హెచ్చరికబోర్డులు లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలో ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో ఇటీవల మంజూరైన రహదారులు, డ్రెయినేజీల పనుల టెండర్లు, అగ్రిమెంట్ ప్రక్రియ ఆలస్యం అవుతోంది. రహదారి నిర్మాణ పనుల పర్యవేక్షణ కొరవడింది. మండలానికి పూర్తి స్థాయి ఆర్అండ్‌బీ ఏఈని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. డీఈ హరిలాల్‌ను వివరణగా కోరగా అశ్వాపురం ఏఈ పోస్టు భర్తీ చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

# బాధిత కుటుంబాలకు చేయూత

**మణుగూరు రూరల్:** మండల పరిధిలోని రామానుజవరం గ్రామంలో గల ఆదరణ వృద్ధాశ్రమ నిర్వహణకు ప్రభుత్వ విప్ రేగా కాంతారావు రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు ఎడవల్లి మలాకీకి స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**మిత్రుడి కుటుంబానికి..**

**అశ్వాపురం:** మండల కేంద్రంలోని చవిటిగూడెం గ్రామానికి చెందిన బొజ్జా కోటేశ్వరరావు ఇటీవల మృతి చెందగా అతనితోపాటు చదువుకున్న అశ్వాపురం జెడ్పీ స్కూల్ 1989–90 పదో తరగతి బ్యాచ్ మిత్రులు ఆదివారం పరామర్శించి రూ.60 వేలు ఆర్థికసాయం అందజేశారు. వైస్ ఎంపీపీ వీరభద్రం, కుంట ఆదినారాయణ, నాగేశ్వరరావు, హనుమంతరావు, నరేష్, నరసింహారావు, రవికుమార్, వాణి, వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, చుంచు రామ్మూర్తి, వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.

**వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం**

**పినపాక:** మండల పరిధిలోని రాయిగూడెం గ్రామానికి చెందిన రామారావు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా వైద్యఖర్చుల నిమిత్తం జనం కోసం మనం స్వచ్ఛంద సంస్థ సభ్యులు బాధిత కుటుంబ సభ్యులకు రూ.10వేల నగదు, 50 కేజీల బియ్యం నిత్యావసర సరుకులుసాయంగా అందజేశారు. భద్రాచలం దుర్గ స్వీట్ షాప్ యజమాని సుధాకర్, సంస్థ ఫౌండర్ గూడూరు కృష్ణారెడ్డి, సభ్యులు సాయిరాం, నరేష్ కుమార్, గుంటక శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అగ్ని ప్రమాదం బాధిత కుటుంబాలకు..**

**మణుగూరు రూరల్:** మండల పరిధిలోని చిక్కుడుగుంట గ్రామానికి చెందిన మాటూరి సాంబశివరావు పూరిల్లు విద్యుదాఘాతంతో పూర్తిగా కాలిపోవడంతో బాధిత కుటుంబాన్ని మణుగూరు జనం కోసం మనం స్వచ్ఛంద సంస్థ సభ్యులు పరామర్శించి రూ.10 వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు గూడూరు కృష్ణారెడ్డి, సభ్యులు సానికొమ్ము శ్రీనివాస్‌రెడ్డి, నరేష్‌కుమార్, సాయిరాం, తంతరపల్లి శోభన్, సర్పంచ్ కుర్సం రాంబాబు, ఎంపీటీసీ రామారావు పాల్గొన్నారు.


మణుగూరు రూరల్: ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

**దుమ్ముగూడెం:** మండలంలోని నడికుడి పంచాయతీ పరిధిలోని డి.కొత్తగూడెం గ్రామంలోని అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు రోటరీక్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో వితరణ అందజేశారు. రోటరీక్లబ్ ప్రెసిడెంట్ వీసం వసంతరావు, ట్రెజరర్ సాగర్, పాస్ట్ ప్రెసిడెంట్ యశోద రాంబాబు, సర్పంచ్ తెల్లం రామకృష్ణ, మందపాటి సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్ గుప్తాల పాల్గొన్నారు.


పినపాక: ఆర్థిక సాయం అందజేస్తున్న జనం కోసం మనం స్వచ్ఛంద సంస్థ సభ్యులు


మణుగూరు రూరల్: సాయం అందజేస్తున్న దృశ్యం


దుమ్ముగూడెం: సరుకులు అందజేత..